క్లుప్తంగా

అలరించిన వీణావాదన



వీణావాదనలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సీటీఆర్ఐ: వసంత పంచమి సందర్భంగా విజయ శంకర నృత్య, సంగీత ప్రభుత్వ పాఠశాలలో సోమవారం జరిగిన కేఎస్ సుబ్రహ్మణ్యం వీణావాదన అలరించింది. ఆ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా సరస్వతీ మాత చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి వెలిగించారు. వయోలిన్ కేటీ సుబ్బారాయన్, మృదంగం సాయి కృష్ణ అందించారు. వీణా, వయోలిన్ విద్యార్థులు పాల్గొన్నారు.

5వ తేదీ లోపు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోండి



చింతాడ లావణ్య

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లాలో ప్రభుత్వం గీత కులాలకు కేటాయించిన 13 మద్యం షాపుల కోసం ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి చింతాడ లావణ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 13 షాపులకు కలెక్టర్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, బీసీ కుల సంఘాల ప్రతినిధుల సమక్షంలో తీసిన లాటరీలో 11 శెట్టిబలిజ, ఒకటి గౌడ, ఒకటి కులానికి కేటాయించడం జరిగిందన్నారు. ఆయా స్టేషన్ల పరిధిలో ఆఫ్ లైన్ లేదా ఆన్‌లైన్‌లో గీత కులాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సీఆర్‌పీ చినబాబుకు సత్కారం



చినబాబును సత్కరిస్తున్న మత్సేటి ప్రసాద్, హెచ్ఎం నరసింహారెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ సీఆర్‌పీగా అవార్డు అందుకున్న చినబాబును బొమ్మూరు జీపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. మాజీ సర్పంచ్ మత్సేటి ప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ రాజు, స్థానిక పెద్దలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై త్వరలో సమావేశం



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: వివిధ శాఖల ఉద్యోగుల సమస్యలపై త్వరలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. ఏపీ ఎన్జీవో సంఘం రాజమహేంద్రవరం నగర శాఖ ఆధ్వర్యంలో ప్రచురించిన డైరీని సోమవారం కలెక్టరేట్‌లో ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, నగర ఎన్జీవో సంఘ అధ్యక్షుడు సుబ్బారావు నాయుడు, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి వేణు మాధవరావు, నగర్ ఎన్జీవో నాయకులు మాధవరావు, సత్యమూర్తి, రాఘవరావు, వెంకటరావు, రమేష్ పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య అత్యంత కీలకం



విద్యార్థుల వర్కు పుస్తకాలను పరిశీలిస్తున్న పాఠశాల విద్యాశాఖాధికారి వాసుదేవరావు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థికి ప్రాథమిక విద్య అత్యంత కీలకమని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు అన్నారు. శాటిలైట్ సిటీ మండల పరిషత్ నెంబర్ – 2 ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. అన్ని తరగతుల రోలు హాజరును పరిశీలించారు. విద్యార్థులతో పాఠాన్ని చదివించి, ప్రశ్నలు అడిగారు. వర్కు పుస్తకాలను పరిశీలించి సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి ఆ తరగతి స్థాయికి నిర్దేశించిన సామర్థ్యాలు సాధించాలన్నారు. తరగతి ఉపాధ్యాయుడు ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలన్నారు. హెచ్ఎం ఏవీరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రథసప్తమికి సర్వం సిద్ధం

- ఆలయాల్లో నేడు ప్రత్యేక పూజలు
- బొమ్మూరు సూర్యమందిరంలో పూర్తయిన ఏర్పాట్లు
- భక్తులకు వసతుల కల్పన



ఆలయ ఆవరణలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు



సూర్య మందిరంలో సూర్యనారాయణస్వామి

రాజమహేంద్రవరం రూరల్: రథసప్తమి వేడుకలకు సర్వం సిద్ధమైంది. అన్ని ఆలయాల్లో ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బొమ్మూరులోని వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలోని సూర్యమందిరంలో రథసప్తమి, సూర్యనారాయణమూర్తి జయంతిని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. హుకుంపేట గ్రామానికి చెందిన గంటా నాగేశ్వరరావు, సత్యవతి దంపతుల కుమారులు గంటా సురేష్, రమాదేవి, గంటా రాంబాబు, ఆమని దంపతులు పీటలపై కూర్చుంటారు. గణపతి పూజ, పుణ్యావచనం, నవగ్రహ ఆరాధన, సూర్యహోమం, సూర్య నమస్కారాలు, సూర్యనారాయణ స్వామి కల్యాణం(శాంతి కల్యాణం) నిర్వహిస్తారు. జ్యోతిర్లింగార్చనతో రథసప్తమి వేడుకలు ముగుస్తాయి. ఆలయ అర్చకుడు కాళ్లకూరి సుబ్రహ్మణ్యశర్మ నేతృత్వంలో కాళ్లకూరి సూరిపండు ఆధ్వర్యంలో విల్లూరి సూరిబాబు, కాళ్లకూరి శ్రీరామశర్మ అర్చక బృందం బ్రహ్మత్వంలో నిర్వహించనున్నారు.

1998లో సూర్యదేవాలయం ప్రారంభం

మహారోగి ఆరోగ్య కేంద్రంలో ఆధ్యాత్మిక ఆర్తిని తీర్చడం కోసం, బాధితుల్లో భక్తి భావనలు పెంపొందించడం కోసం 1998లో సూర్యదేవాలయాన్ని నిర్మించారు. చిన జీయర్ స్వామి ప్రతిష్ఠించిన ఈ దేవాలయానికి ప్రతి రథసప్తమి వేడుకలకు బొమ్మూరుతో పాటు పరిసర గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. కేంద్ర వాసులందరూ సూర్యభగవానుడిని ప్రత్యక్ష దైవంగా కొలుస్తారు. భారతమాత వారి ఇలవేల్పు వివేకానంద గో నిలయం పేరున 30 గోవులతో గోశాలను సైతం నిర్వహిస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి

రథసప్తమి సందర్భంగా సూర్యమందిరానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రం ప్రకల్ప సంయోజకులు ఓలేటి సత్యనారాయణ, కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. ఆలయ ఆవరణలో క్యూలైన్లు తదితర వాటిని ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పూజలు

సూర్యమందిరంలోని సూర్యనారాయణస్వామికి సోమవారం ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని 121 సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అధికసంఖ్యలో దంపతులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా నిధుల కేటాయింపు జరిగిందని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు ఏవీ రమణ అన్నారు. బొమ్మూరులోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో కె.అప్పలరాజు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, కార్మికులు, ఉద్యోగులు, దళితులు, బడుగు బలహీన వర్గాలకు మొండిచెయ్యి చూపారన్నారు. వస్తువుల ధరలు నియంత్రణ ఊసే లేదని, ధరల స్థిరీకరణకు నిధులు కేటాయింపులు లేవని, గ్రామీణ ఉపాధి పథకానికి నిధులు పెంపు లేదని, ఉపాధి కార్మికుల పని దినాలు పెంచే సూచనలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు బడ్జెట్లో అధిక ప్రాధాన్యమిచ్చి, నిధులు కేటాయించడం జరిగిందన్నారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సంస్థ సేవలు ప్రశంసనీయం



వృద్ధులకు చీరలు పంచిపెడుతున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సంస్థ ద్వారా నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు సమాజానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు అన్నారు. లాలాచెరువు సమీపంలోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం 21వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విశ్రాంత ఆర్‌డీవో ఎం.జితేంద్ర, విశ్రాంత అడిషనల్ ఎస్పీ వి.గోపాలకృష్ణ, టెలికం విశ్రాంత డీజీఎం కేవీ చలపతిరావు, ఇంజినీర్ ఓం ప్రకాష్, వై.రామలింగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల వారి అవసరాలను గుర్తెరిగి, సేవలు అందించడం అభినందనీయమన్నారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజన సదుపాయం కల్పించడమే కాకుండా వారి అవసరాలన్నింటినీ గుర్తించి, సేవ చేయడం డాక్టర్ రాంబాబుకే చెల్లిందన్నారు. కోవిడ్ సమయంలో చేసిన సేవలే కాకుండా నిత్యం నిరాశ్రయులకు, అవసరార్థులకు భోజనం పెట్టడం, చిరు వ్యాపారాలకు గొడుగుల అందజేయం, మహిళలకు కుట్టు, ఇతర చేతి వృత్తులలో శిక్షణ, యువతకు కంప్యూటర్ శిక్షణ వంటి బహుముఖ సేవలు అందించడం గుబ్బల రాంబాబుకు సమాజంపై నిబద్ధత, అంకితభావానికి నిదర్శనమన్నారు. గుబ్బల రాంబాబు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ద్వారా అందజేస్తున్న సేవలను మరింత విస్తృత పరచడానికి ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళుతున్నామన్నారు. కార్యక్రమంలో జాతీయ ట్రైనర్ కె.నాగిరెడ్డి, హెల్పింగ్ హేండ్స్ అనూప్ జెన్నీ, వెంకటరత్నం, స్వర్ణాంధ్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఘర్షణ విషయంలో ఇరు వర్గాలపై కేసులు

సీతానగరం: మిర్తిపాడులో ఆదివారం జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరు వర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు. ఒక వర్గం యువకులు మోటారు సైకిల్‌పై వెళుతూ, మరో వర్గం యువకులకు సైగ చేయడంతో వివాదం మొదలైందన్నారు. దీనిలో మిర్తిపాడుకు చెందిన మేడే దుర్గాప్రసాద్‌పై కాళ్ల దుర్గాప్రసాద్, కాళ్ల నాగేంద్ర, గురు శివ కర్రలతో విచక్షణరహితంగా దాడి చేశారన్నారు. తలకు తీవ్ర గాయాలపైన దుర్గాప్రసాద్ రాజమహేంద్రవరం ప్రభుత్వం ఆస్పత్రిలో చికిత్స పొందాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామన్నారు. దీనిపై డీఎస్పీ విచారణ నిర్వహిస్తారని తెలిపారు.

▸▸ మిర్తిపాడుకు చెందిన రాజన పైడియ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటనగరం, మిర్తిపాడుకు చెందిన పదిహేను మందిపై కేసులు నమోదు చేశామని ఎస్సై రామ్ కుమార్ తెలిపారు. మిర్తిపాడు, రాజమహేంద్రవరం రూరల్ వెంకటనగరానికి చెందిన యువకులు తనను కర్రలతో తీవ్రంగా కొట్టడంతో తలకు, అలాగే రక్తపు గాయాలయ్యాయని పైడియ్య ఫిర్యాదు చేశాడన్నారు. దీంతో బజ్జి శరత్, వాడపల్లి, సురేష్, బన్ను, కోనాల కిషోర్, పెనుగుల చందుతో పాటు పదిహేను మందిపై కేసులు నమోదు చేశామన్నారు. మిర్తిపాడులో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీస్ పికెటింగ్ కొనసాగుతోందన్నారు.

రహదారి పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలి



ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరికి రహదారి సమస్యను వివరిస్తున్న చందన నగర్ కాలనీ వాసులు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు చందన నగర్ కాలనీలో వంద కుటుంబాల రహదారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి మిత్ర వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. బీజేపీ రూరల్ అసెంబ్లీ కన్వీనర్ యానాపు ఏసు ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు చేకూరి లక్ష్మి, చేకూరి సునీత, చేకూరి జ్యోతి, పైలా రూప, కుమారి, ఉక్కుసూరి సోనీప్రియ, విజయలక్ష్మి తదితరులు సోమవారం ఎమ్మెల్యే గోరంట్లను కలిసి వినతి పత్రం అందజేశారు. కొంతమూరులోని చందన నగర్ (మనీషా ఫంక్షన్ హాలు ఎదురుగా)లో సుమారు వంద కుటుంబాలు ఉంటున్నాయన్నారు. మెయిన్ రోడ్డు నుంచి కాలనీలోకి వెళ్లడానికి 33 ఏళ్లుగా వాడుకలో గల ఈ దారి ప్రధాన రహదారికి కలిపి ఉందన్నారు. వంద ఇళ్లకు ఇదే ఏకైక మార్గమన్నారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తిగత కారణాలతో తాము వేసుకున్న పంచాయతీ కల్వర్టుకు ఇరువైపులా తవ్వి, ఫెన్సింగ్ వేసి రాకపోకలకు ఆటంకం కల్గించారన్నారు. ప్రతి ఇంటికి పంచాయతీ ప్లాన్ అప్రూవ్ చేశాకే ఇళ్లు కట్టుకున్నామని, పైగా, ఇది మాస్టర్ ప్లాన్‌లో ఉన్న రోడ్డు అన్నారు.

సభ్యత్వం తీసుకుంటే అనేక ప్రయోజనాలు



సభ్యత్వాలను అందజేస్తున్న మూర్తి, జగ్గారావు తదితరులు

సీటీఆర్ఐ: ఏపీ వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ కార్యదర్శులు అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకోవాలని డబ్ల్యూపీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జగ్గారావు కోరారు. రుడా చీఫ్ ప్లానింగ్ అధికారి జీవీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో సోమవారం వారికి సభ్యత్వం నమోదు చేశారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ ప్లానింగ్ అధికారులు మంచి పనితీరు కనబరిచి డిపార్ట్‌మెంటుకు పేరు తీసుకురావాలన్నారు. జగ్గారావు మాట్లాడుతూ రాజమహేంద్రవరం కార్పొరేషన్, రుడాలో ఉన్న వార్డు ప్లానింగ్ కార్యదర్శులు తప్పకుండా సభ్యత్వం తీసుకోవాలన్నారు. దీనివల్ల యూనియన్ తరపున సహాయ సహకారాలు అందుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ సభ్యత్వ నమోదును జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కొండల యువ కిషోర్, పేరెల్లి శ్రీహర్ష, అరుణ్ కుమార్, సుభాకర్, భువన్ చందు, శ్యామ్, దొమ్మేటి భాస్కర్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

చెడు స్నేహాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథం

రాజమహేంద్రవరం రూరల్: చెడు స్నేహాలకు దూరంగా ఉండడం చాలా మంచిదని బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ పి.కాశీ విశ్వనాథం అన్నారు. క్రమశిక్షణ – విద్యార్థుల భవిష్యత్తు అనే అంశంపై సోమవారం సాయంత్రం జీపీఆర్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ ముఖఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ కేవలం చదువుపైనే దృష్టి కేంద్రీకరించాలన్నారు. సామాజిక మాధ్యమాలను కేవలం విజ్ఞానం పెంపొందించుకోవడానికి మాత్రమే వినియోగించాలన్నారు. గంజాయి, సిగరెట్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో క్రమశిక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కరాటే చాంపియన్ ఎస్.ప్రజ్ఞను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మత్సేటి ప్రసాద్, ఎస్సై సీహెచ్‌వీ రమేష్, విద్యా కమిటీ చైర్మన్ పితాని రాజు, మహిళా సంరక్షణ కార్యదర్శులు యు.ప్రియాంక, జి.చాందిని, పి.అరుణ పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నుల పంపిణీ



విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేస్తున్న చిన్న వెంకన్నబాబు తదితరులు

సీటీఆర్ఐ: వసంత పంచమిని పురస్కరించుకుని సరస్వతీ మాత పూజలో ఉంచిన పెన్నులు, పెన్సిళ్లను విద్యార్థులకు అందించడం ఆనందంగా ఉందని గాడాలలోని మహాలక్ష్మి సమేత వేంకటేశ్వర స్వామి పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు స్వామీజీ అన్నారు. పీఠంలో సోమవారం అమ్మవారి పూజలో ఉంచిన 5 వేల పెన్నులను జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. గత 18 ఏళ్లుగా క్రమం తప్పకుండా వసంత పంచమి రోజున పూజ చేసిన పెన్నులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. గాడాల గ్రామంలోని బొమ్మన నారాయణ జిల్లా పరిషత్ హైస్కూల్, జూనియర్ కాలేజీలో సోమవారం 300 పెన్నులను పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మనగుడి–మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి గౌరవ సలహాదారు ధరణికోట కుమారి, దత్త నృసింహరాజు ట్రస్ట్ జాతీయ సలహాదారులు బసా సత్యనారాయణ, రాష్ట్ర వైస్ చైర్మన్ పడాల పండు, ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్, జాతీయ కార్యదర్శి మద్ది శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అణు కార్యకలాపాలపై అపోహలు తొలగించాలి



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ మహాపాత్ర, ప్రిన్సిపాల్ రామచంద్ర

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అణు కార్యకలాపాలు, అణుశాస్త్రం చుట్టూ ఉన్న అపోహలను తొలగించాలని ముంబైలోని భాభా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) రేడియో కెమిస్ట్రీ విభాగం, రేడియో కెమిస్ట్రీ ఐసోటోప్ గ్రూప్ మాజీ డైరెక్టర్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ పీకే మహాపాత్ర అన్నారు. 'రేడియో కెమిస్ట్రీ, రేడియో ఐసోటోప్‌ల అనువర్తనాలు' అనే అంశంపై స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఐదు రోజుల జాతీయ వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. బార్క్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ న్యూక్లియర్ కెమిస్ట్స్ అండ్ అలైడ్ సైంటిస్ట్స్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్‌ను డాక్టర్ మహాపాత్ర, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే ప్రారంభించారు. ఈ సందర్భంగా 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ ఎట్ ఎ గ్లాన్స్, శాంతియుత అణుశక్తి ఉపయోగాలు' అనే అంశంపై మహాపాత్ర కీలకోపన్యాసం చేశారు. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, ఆహార భద్రత, ఇంధన ఉత్పత్తి, పర్యావరణ స్థిరత్వంలో అణు శాస్త్రం పాత్రను ఆయన వివరించారు. రేడియో కెమిస్ట్రీ, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమ, పర్యావరణ శాస్త్రాల్లో రేడియో ఐసోటోప్‌ల విభిన్న అనువర్తనాలపై సమగ్ర అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ వర్క్‌షాప్ జరుగుతుందని చెప్పారు. పాలిమర్ సైన్సెస్, బయోసైన్సెస్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్, పర్యావరణ శాస్త్రాలు, పారిశ్రామిక అనువర్తనాల వంటి వివిధ రంగాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ రామచంద్ర మాట్లాడుతూ, దేశంలోని వివిధ రాష్ట్రాలు, సంస్థల నుంచి అధ్యాపక సభ్యులు, పరిశోధన పండితులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర విభాగాధిపతి కోమల లక్ష్మి, వర్క్‌షాప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బి.గౌరినాయుడు, కన్వీనర్ డాక్టర్ పీఎస్ రామాంజనేయులు పాల్గొన్నారు.


జీఎస్ఎల్ కళాశాలలో శిల్పం ఆవిష్కరణ



శిల్పాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రాజానగరం: 'మీ జీవితాన్ని మీరే మలుచుకోవాలి' అనే సందేశం ఇస్తున్నట్టుగా ఉన్న ఒక శిల్పాన్ని స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల ప్రాంగణంలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులు సోమవారం ఆవిష్కరించారు. 'యు ఆర్ ది ఆర్కిటెక్ ఫర్ యువర్ లైఫ్' అనే క్యాప్షన్‌తో ఉన్న ఈ శిల్పాన్ని జీఎస్ఎల్ స్టాట్యూగా ఆ సంస్థ చీఫ్ మెంటర్ డాక్టర్ గన్ని భాస్కరరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌వీజీ మార్కెట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మారిశెట్టి మృతి



రాజమహేంద్రవరం రూరల్/మధురపూడి: వెంకటేశ్వర జనరల్ మార్కెట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రస్తుత గౌరవాధ్యక్షుడు, చాంబర్ మాజీ అధ్యక్షుడు మారిశెట్టి వెంకట రామారావు (85) ఆదివారం రాత్రి కోరుకొండ మండలం నరసాపురంలో మృతి చెందారు. ఎస్‌వీజీ మార్కెట్ ఏర్పాటులో ఆయన కీలక భూమిక పోషించారు. నరసాపురంలో ఆయన మృతదేహానికి వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు జక్కంపూడి గణేష్, ఎస్‌వీజీ మార్కెట్ అధ్యక్ష, కార్యదర్శులు నందెపు శ్రీనివాస్, మద్దాల రవిశంకర్, ఉపాధ్యక్షుడు బూర్లగడ్డ వెంకట సుబ్బారాయుడు, డైరెక్టర్లు, వర్తకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మారిశెట్టి రామారావు మనవడు రవి కుమార్ చేతుల మీదుగా నరసాపురం గ్రామంలో అంత్యక్రియలు జరిపారు. మారిశెట్టి మృతికి సంతాపంగా సోమవారం ఎస్‌వీజీ మార్కెట్ సెలవు ప్రకటించి, షాపులను మూసివేశారు.

ప్రాథమిక విద్యాబోధన ఎంతో కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న సుభాషిణి

రాజానగరం: ప్రతి విద్యార్థికి ప్రాథమిక స్థాయిలో ఒకటి, రెండు తరగతులు ఎంతో కీలకమని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి అన్నారు. అందుకనే ఈ తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఏటా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారన్నారు. ఏటాదికి 20 రోజులు చొప్పున మూడేళ్లలో 60 రోజుల పాటు శిక్షణ ఇచ్చి, ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారన్నారు. మండలంలోని కొండగుంటూరు పాలిటెక్నిక్ కళాశాలలో పునాది అభ్యసనా శిక్షణ కార్యక్రమం (9వ బ్యాచ్) సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒకటి, రెండు తరగతులు బోధించే ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో మమేకమై బోధన చేయాలన్నారు. కాగా.. ఈ కార్యక్రమాన్ని డీఈఓ సందర్శించారు. శిక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన లెర్నింగ్ కార్నర్స్‌లో కొందరు ఉపాధ్యాయులు పప్పెట్ మాస్కులు ధరించి హాజరుకావడాన్ని డీఈఓ అభినందించారు. ఇలా ఆటపాటలతో సాగించే అభ్యసనం విద్యార్థికి ఎక్కువ కాలం గుర్తుంటుందన్నారు. ఈ పునాది అభ్యసన శిక్షణ శిబిరం ముఖ్యఉద్దేశం కూడా ఇదేనన్నారు. మోనటరింగ్ అధికారి డి.గౌరీ శంకరరావు మాట్లాడుతూ ఈ శిక్షణకు తూర్పు గోదావరి నుంచి 15 మంది, కాకినాడ జిల్లా నుంచి 95 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 169 మంది ఒకటవ తరగతి బోధించే ఉపాధ్యాయులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎంఈఓ రామకృష్ణ, డైట్ లెక్చరర్ రాజ్‌కుమార్, ప్రథమ్ జిల్లా కో ఆర్డినేటర్ కె. అనూష, ఇద్దరు కేఆర్పీలు, 22 మంది డీఆర్పీలు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసానికి హాజరైన తల్లిదండ్రులు, చిన్నారులు

కడియం: కడియపులంక గ్రామదేవత ముసలమ్మ అమ్మవారి ఆలయంలో కొలువైన జ్ఞాన సరస్వతీ దేవి అమ్మవారికి సోమవారం వసంత పంచమి సందర్భంగా పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం వైభవంగా నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు జరిపారు.